



మోకాలి లోతు నీటిలో మేడారం (ఫైల్)

ముంపుపై ముందు జాగ్రత్త!

మలుగు జిల్లాకు వరద భయం

గోదావరి, జంపన్నవాగు, దయ్యాలవాగు పరివాహక ప్రజల్లో గుబులు

ప్రభావిత గ్రామాలు 98

సహాయ చర్యలకు అధికార యంత్రాంగం సన్నద్ధం

సిద్ధమైన యాక్షన్‌ప్లాన్

పునరావాస కేంద్రాల ఏర్పాటు.. నిత్యావసర సరుకుల నిల్వలు

ప్రత్యేక అధికారుల నియామకం

ఏటూరునాగారం ఐటీడీఏలో కంట్రోల్ రూమ్

ములుగు, జూన్ 21: వనాకాలం వచ్చేసింది. ఎప్పటి లాగే ఈసారి కూడా లోతట్టు ప్రాంత ప్రజల్లో భయాందోళన నెలకొంది. అయితే.. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. వరదల నుంచి ప్రజలను కాపాడేందుకు సన్నద్ధమైంది. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ ప్రకటనలతో అలర్ట్ అయ్యింది. వరద పోటెత్తే జంపన్నవాగు, దయ్యాలవాగు, గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలను అత్యవసర పరిస్థితుల్లో సురక్షిత ప్రాంతాలకు తరలించడం, నిత్యావసరాలు, మందులు అందించడంపై దృష్టిసారిస్తూనే వరద కట్టడికి జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ టి.ఎస్.దివాకర వరుస పర్యటనలు చేస్తూనే అధికారులతో సమావేశమవుతున్నారు. ముందస్తు సహాయక చర్యలపై అప్రమత్తం చేస్తున్నారు. అయితే.. గతం చేసిన గాయాలను తలుచుకుంటూ ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

వరదలకు 16 మంది బలి

ములుగు జిల్లా చరిత్రలోనే తొలిసారిగా గతేడాది జూలై 26న ఒక్కరోజే 193.7మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. వెంకటాపూర్(రామప్ప) మండలం లక్ష్మీదేవిపేటలో రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 649.మి.మీ వర్షం కురిసింది. దీంతో పోటెత్తిన వరదలతో జిల్లా వ్యాప్తంగా 16మంది ప్రాణాలు కోల్పోయారు. ఓ విపత్తుకు ఇంతమంది బలికావడం ఇదే తొలిసారి. ఏటూరునాగారం మండలం కొండాయిలో ఎనిమిది మంది మృతి చెందారు. వెంకటాపూర్(రామప్ప) మండలం బూర్గుపేటకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఓ వృద్ధురాలు, భార్యాభర్తలు వరదలో కొట్టుకుపోగా ఇద్దరి శవాలు ఇంకా లభ్యం కాలేదు.

గోవిందరావుపేట మండలం ప్రాజెక్టునగర్‌లో తల్లి, ఇద్దరు కుమారులు దయ్యాలవాగు ప్రవాహంలో గల్లంతయ్యారు. తల్లి, ఓ కొడుకు మృతదేహాలు దొరకగా రెండేళ్ల మరో బాలుడి ఆచూకీ ఇప్పటికీ లేదు. మేడారంలోని జంపన్నవాగు ఒడ్డున ఓ గుర్తుతెలియని వ్యక్తి వరదకు కొట్టుకొచ్చి విద్యుత్ తీగలకు చిక్కుకొని మరణించాడు. 329 మూగజీవాలు వరదలో కొట్టుకుపోయి మృతిచెందాయి.

ధ్వంసమైన రోడ్లు.. తెగిన చెరువులు.. కూలిన ఇళ్లు..

వరదలకు జనజీవనం అస్తవ్యస్థం కాగా రోడ్లు ధ్వంసమయ్యాయి. చెరువులు, కాల్వలు తెగిపోగా కొన్ని ఇళ్లు పూర్తిగా, మరికొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. అధికారిక లెక్కల ప్రకారం 52 రోడ్లు కొట్టుకు పోయాయి. 81చెరువులు, కుంటల కట్టలు దెబ్బతినగా పంటకాల్వలకు గండ్లు పడ్డాయి. 105 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 2 వేలకు పైగా కరెంటు స్తంభాలు దెబ్బతినగా విద్యుత్ శాఖకు రూ.5 కోట్లకు పైగా నష్టం కలిగింది. 184 ఇళ్లు పాక్షికంగా, 43 పూర్తిగా దెబ్బతిన్నాయి.

ఆలస్యమైన పునరుద్ధరణ చర్యలు

ఎన్నికలు, కోడ్ అమలులో ఉండటంతో వరదల నివారణ, పునరుద్ధరణ చర్యలపై ప్రభావం పడింది. 2023 చివరార్థం, 2024 ప్రథమార్థమంతా అలాగే గడిచిపోయింది. దీంతో ప్రతిపాదనలు సమర్పించినా నిధులు మంజూరుకాని పనులు కొన్నైతే.. చాలావరకు నిధులు విడుదలైనా మొదలుపెట్టలేని పరిస్థితి నెలకొంది. 15రోజుల క్రితమే ఆంక్షలన్నీ తొలగిపోగా అధికార యంత్రాంగం కదిలింది. శాశ్వత నిర్మాణాలకు అనువైన సమయం లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం, ఇబ్బంది లేకుండా ఈసీజన్ గట్టెక్కే విధంగా తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. వరదలకు కొట్టుకుపోయిన కొండాయి హైలెవల్ వంతెనకు రూ.9.50కోట్లు మంజూరైనప్పటికీ ప్రస్తుతం రూ.35 లక్షల వ్యయంతో ఐరన్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని నిర్మించారు. తాడ్వాయి-గోవిందరావుపేట మధ్య జలగలంచ కాజ్‌వే కొట్టుకుపోయి జాతీయ రహదారిపై 27రోజులు రాకపోకలు నిలిచిపోగా తాత్కాలిక మరమ్మతులు చేసి వినియోగంలోకి తెచ్చారు. ఇక్కడ హైలెవల్ వంతెన నిర్మాణానికి ప్రభుత్వానికి నివేదించారు. అయితే.. ములుగు-గణపురం మధ్య బండారుపల్లి వద్ద రాళ్లవాగు కల్వర్టు కూలిపోగా పక్క నుంచి తాత్కాలిక రోడ్డు వేసినప్పటికీ ఈసారి వరదలకు రాకపోకలకు అంతరాయం తప్పేట్టు లేదు. కల్వర్టు నిర్మాణానికి రూ.2 కోట్ల ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి.

ప్రమాదంలో చెరువులు, కుంటలు

మిషన్ కాకతీయ పనులు తప్ప ఈమధ్యలో మరమ్మతులు లేని అనేక చెరువులు, కుంటలు వరదల ప్రభావానికి గురయ్యాయి. మేజర్, మైనర్ ఇరిగేషన్ పరిధిలోని 81 చెరువులు, 38 కాల్వలు దెబ్బతిన్నాయి. రూ.7.8 కోట్లతో పునరుద్ధరణకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రస్తుతం వీటికి వరద ముప్పు పొంచి ఉంది. కట్టలు, తూములు, మత్తడి దెబ్బతినగా తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. బూర్గుపేట వద్ద గల మారేడుగొండ చెరువు కట్ట నిర్మాణానికి రూ.4.8 కోట్లతో ప్రతిపాదనలు పంపగా నిధులు మంజూరుకావాల్సి ఉంది. దీంతో 543 ఎకరాల ఆయకట్టు ప్రమాదంలో

» మిగతా 6వ పేజీలో...




తెగిపోయిన మారేడుగొండ చెరువు కట్ట



కొండాయి వంతెనపై తాత్కాలిక ఐరన్ బ్రిడ్జి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర



దెబ్బతిన్న బండారుపల్లి సమీపంలోని రాళ్లవాగు బ్రిడ్జి



పోలీస్ పోస్టింగ్.. పైరవీస్!

- ఎన్నికల కోడ్ ముగియడంతో పైరవీలు మొదలు
- పాత స్థానాల్లోకి మళ్లీ వచ్చేందుకు పలువురి ఆసక్తి
- ప్రస్తుత స్టేషన్లలోనే కొనసాగాలనుకుంటున్న కొందరు..
- పైరవీల కోసం నేతల చుట్టూ ప్రదక్షిణలు
- ఎస్ఐ నుంచి ఏసీపీల వరకు ఎవరి ప్రయత్నాల్లో వారు
- ఇదే అదనుగా రంగంలోకి దళారులు
- పోస్టింగుకో రేటు ఫిక్స్.. నగర శివారుల్లోని స్టేషన్లకు ఫుల్ డిమాండ్
- సిఫారసు లేఖ లేకుంటే ఎంత సిన్సియర్‌గా జాబ్ చేసినా లూప్ లైన్‌కేనని చర్చ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఖాకీలకు బదిలీల టెన్షన్ పట్టుకుంది. ఎన్నికల కోడ్ ముగియడంతో తమను ఎక్కడికి బదిలీ చేస్తారో అనే ఆందోళనలో పోలీసుల్లో కనిపిస్తోంది. దీంతో పోస్టింగ్‌లకు సిఫారసు లేఖల కోసం నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మంచి చోట పోస్టింగ్ ఇస్తే అదే స్థాయిలో భారీగా నజరానా ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఎస్ఐల నుంచి ఏసీపీల వరకు తాము కోరుకున్న పోస్టింగ్‌ల ఇప్పించేలా పైరవీ చేయాలంటూ తిరుగుతున్నారు. అయితే ఎన్నికలకు ముందు పైరవీలతో పోస్టింగ్ కొట్టిన కొందరు ఖాకీలు మూడు రోజులు తిరగక ముందే ఎన్నికల కోడ్ పేరుతో బదిలీ అయ్యారు. వారిలో చాలామంది నాటి తమ పోస్టులు తమకే తిరిగి ఇవ్వాలని నేతలపై ఒత్తిడి తెస్తుండగా, ప్రస్తుతం డ్యూటీలు నిర్వహిస్తున్న అధికారులు ఇక్కడే కొనసాగేలా అదేస్థాయిలో నేతలపై ఒత్తిడి తీసుకొస్తున్నట్టు చర్చ జరుగుతోంది. దీంతో నేతలు ఎవరికి సిఫార్సు లేఖలు ఇస్తారో అనే ఉత్కంఠ నెలకొంది.

ఐఏఎస్, ఐపీఎస్‌లతో బదిలీలు షురూ..

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ప్రభుత్వం ఎన్నికల ముందు జిల్లాలో మూడేళ్లకు పైగా పని చేసిన వారిని, సొంత జిల్లాలో పని చేసినవారిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేసింది. వారి స్థానంలో కొత్త అధికారులను నియమించింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగియటంతో ప్రభుత్వం పరిపాలనపై దృష్టి పెట్టింది. ప్రధానంగా గత ప్రభుత్వం నియమించిన కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎస్పీలు, డీసీపీలను బదిలీలు చేసింది. ఇందులో భాగంగా దీంతో ఈ నెల 15వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భూపాలపల్లి, ములుగు, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లను బదిలీ చేసింది. వరంగల్ వెస్ట్ (జనగామ), వరంగల్ సెంట్రల్ డీసీపీలకు కూడా స్థానం చలనం జరిగింది. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత పెద్ద ఎత్తున ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు చేపట్టడంతో తరువాత కింది స్థాయి అధికారుల బదిలీలు ఉంటాయనే చర్చ జరుగుతోంది. ప్రధానంగా వరంగల్ కమిషనరేట్‌తో పాటు భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో కూడా ఎస్ఐ, సీఐ, డీఎస్పీల బదిలీపై అధికార పార్టీ నేతలు దృష్టిసారించారు. దీంతో రెండుమూడు రోజుల్లో భారీగా బదిలీలు జరిగే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

దళారుల రంగ ప్రవేశం..!

బదిలీల పర్వం మొదలు కాటంతో మంచి పోస్టింగ్ కోసం నేతల చుట్టు ఖాకీలు ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే కొందరు ఎమ్మెల్యేలు, నేతలు ఖాకీల పనితీరు కంటే సామాజిక వర్గానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారనే చర్చ జరుగుతోంది. సామాజిక వర్గం అధికారులు లేకుంటే సమర్థత, విశ్వసనీయత, పనితీరు, పాత పరిచయాలు తదితర అంశాలను బేరీజు వేసుకుంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వరంగల్ పోలీస్‌కమిషనరేట్‌తో పాటు మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాలో ఇచ్చే పోస్టింగుల్లో ఎక్కువ శాతం తమ సామాజిక వర్గానికి చెందిన అధికారులకే సిఫార్సులు చేస్తున్నారనే చర్చ జరుగుతుండగా మరికొన్ని చోట్ల మాత్రం పోస్టింగుకో రేటు ఫిక్స్ చేసి దళారులతో బేరసారలకు కొంతమంది నేతలు దిగుతున్నారనే ప్రచారం ఉంది. వరంగల్ నగరం సమీపంలోని ఓ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే పోలీస్‌స్టేషన్లకు భారీగా ధర పలుకుతుందనే చర్చ పోలీసు వర్గాల్లో జోరుగా సాగుతోంది. నగరం నడిబొడ్డున ఉన్న ఓ ఏసీపీ పోస్టింగ్ కోసం పొరుగు జిల్లా మంత్రితో ఓ అధికారి పైరవీలు చేస్తున్నారనే చర్చ జరుగుతుండగా.. పరకాల నియోజకవర్గం పరిధిలో రెండు స్టేషన్లలో పోస్టింగుల విషయంలోనూ ముగ్గురు

» మిగతా 6వ పేజీలో...

'సార్'కు ఘన నివాళి



భూపాలపల్లిలో జయశంకర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి, కమిషనర్ రాజేశ్వర్

భూపాలపల్లిటౌన్, జూన్ 21: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని శుక్రవారం భూపాలపల్లి మునిసిపల్ పాలక మండలి సభ్యులు, అధికారులు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉన్న జయశంకర్ విగ్రహానికి మునిసిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, కమిషనర్ రాజేశ్వర్ పూలమాల వేసి నివాళులర్పించారు. జయశంకర్ సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. టీపీవో సునీల్, ఆర్ఐ భాస్కర్, టీవో మానస తదితరులు పాల్గొన్నారు.

- కాటారం : ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని మండలంలోని పలు కార్యాలయాలు, విద్యా సంస్థల్లోత నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం, పలు పాఠశాలల్లో జయశంకర్ చిత్రపటానికి ఎంపీపీ పంతకాని సమ్మయ్యతోపాటు ఉపాధ్యాయులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్ఎం శైలజ, ఉపాధ్యాయులు రాజబాబు, శారద, రవీందర్, రాజారాం, హారిక, ఈజీఎస్, పంచాయతీరాజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- ఏటూరునాగారం: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని మండలంలో నిర్వహించారు. ఏటూరునాగారంలోని బస్టాండ్ వద్ద జయశంకర్ విగ్రహానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు తదితరులు పూలమాలు వేసి నివాళులు అర్పించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎమ్డీ. ఖాజా పాషా ఆధ్వర్యంలో జయశంకర్ వర్ధంతిని నిర్వహించారు.



ఏటూరునాగారంలో జయశంకర్ విగ్రహానికి పూలమాలు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అడవి దుంపలు తిని ఐదుగురికి అస్వస్థత

వెంకటాపురం(నూగూరు), జూన్ 21: అడవి దుంపలు తిని ఐదుగురు అస్వస్థతకు గురైన సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... మండలంలోని వీఆర్‌కెపురం గ్రామానికి చెందిన మహిళలు నవ్య, మల్లక్క, రమ్య, రాజు, సరోజిని మల్లాపురం గ్రామ సమీపంలోని రాఘవమ్మ చెరువు అటవీ ప్రాంతంలో అడవి దుంపలైన తెల్లశనగ గడ్డలను తవ్వుకొని ఇంటికి తీసుకొచ్చుకున్నారు. అనంతరం వాటిని ఉడకబెట్టి తినటంతో వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు వారిని వెంకటాపురం వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వారికి ప్రాణాపాయం తప్పిందని సమాచారం.



భూపాలపల్లిలోని జయశంకర్ పార్కులో యోగా చేస్తున్న యువతీ, యువకులు, తదితరులు

ఘనంగా యోగా డే

భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. పలు విద్యాలయాలు, కార్యాలయాలు, క్రీడా మైదానాలు తదితర ప్రదేశాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నాపెద్దా తేడా లేకుండా యోగాసనాలు వేశారు. శారీరక, మానసిక ఆరోగ్యం కోసం యోగా ఎంతో దోహదపడుతుందని గురువులు ఈ సందర్భంగా వివరించారు. యోగాసనాలతో అనేక రుగ్మతలు దూరమవుతాయని అవగాహన కల్పించారు.

» వివరాలు 6లో..

బొగ్గు బ్లాకును సింగరేణికి కేటాయించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్

కాకతీయఖని, జూన్ 21: రాష్ట్ర విభజన చట్టం ప్రకారం మంచిర్యాల జిల్లా శ్రావణపల్లి బొగ్గు బ్లాకును ఎలాంటి టెండర్ లేకుండా సింగరేణి సంస్థకు అప్పగించాలని సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. భూపాలపల్లి పట్టణంలోని కొమురయ్య భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు గనులను వేలం వేయడానికి బీజేపీ ప్రభుత్వం ఆతృత ప్రదర్శిస్తోందని విమర్శించారు. గతంలో పలు రాష్ట్రాలకు వేలం వేయకుండానే బొగ్గు గనులను అప్పగించారని గుర్తు చేశారు. అలాంటిది కోయగూడెం-3, సత్తుపల్లి-3 బొగ్గు బ్లాకులను సింగరేణి వేలంలో పాల్గొనకుండానే ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారన్నారు. సింగరేణి స్వచ్ఛంద సంస్థ అని, రాజకీయాలను పక్కన పెట్టి సంస్థ మనుగడకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. సింగరేణిపై ఆధారపడి లక్షల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవిస్తున్నారన్నారు. బొగ్గు గనుల శాఖ మంత్రిగా తెలంగాణకు చెందిన కిషన్‌రెడ్డిని నియమించడం గర్వకారణమన్నారు. అయితే విభజన చట్టం కింద శ్రావణపల్లి బొగ్గు బ్లాకును స్వచ్ఛందగా సింగరేణికి కేటాయించేలా కిషన్‌రెడ్డి చూడాలని డిమాండ్ చేశారు. సింగరేణికి కాకుండా వేలం నిర్వహించాలని చూస్తే పెద్దఎత్తున నిరసనలకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏరియా బ్రాంచి కార్యదర్శి మోటపలుకుల రమేష్, నాయకులు శ్రీనివాస్, మంతు, రామ్‌చందర్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్

షెడ్యూల్డ్ తెగల హక్కులు కాపాడాలి

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్



మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్

ములుగు కలెక్టరేట్, జూన్ 21: ములుగు జిల్లాలో షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి, హక్కుల పరిరక్షణకు అధికారులు కృషి చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ అన్నారు. ములుగులోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో శుక్రవారం ఆయన కలెక్టర్ టి.ఎస్.దివాకర, ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా హుస్సేన్ జిల్లాలో గిరిజనులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, విద్య, వైద్యం తదితర సౌకర్యాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. షెడ్యూల్డ్ తెలగల సాంఘిక-ఆర్థికాభివృద్ధికి వివిధ ప్రణాళికల రూపకల్పనకు చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పించే సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలని, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధిచెందే విధంగా రూపొందించిన ప్రణాళికలను షెడ్యూల్డ్ కులాల వారికి అందేవిధంగా చూడాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉంటే గ్రామాలకు రవాణా, విద్యుత్, వైద్యం, విద్య, తాగునీరు వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఏటూరునాగారం ఐటీడీఏ ఆధ్వర్యంలో చదువుకున్న విద్యార్థుల పూర్తి వివరాలు సేకరించి వారి ఆర్థిక పరిస్థితి, తదితర అంశాలను తెలుసుకునే విధంగా సర్వే చేపట్టాలన్నారు. అధికారులు గిరిజన ప్రాంతాల్లో పర్యటిస్తూ, పరిశీలిస్తూ వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు. ప్రత్యేకంగా గిరిజన యువతీ యువకులకు ప్రభుత్వ, ప్రైవేట్, స్వయం ఉపాధి, తదితర రంగాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. యువతకు స్థానికంగానే ఉపాధి కల్పించేవిధంగా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసేవిధంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. గిరిజనులు సమస్యలపై దరఖాస్తులు సమర్పిస్తే వాటికి ప్రాధాన్యం ఇచ్చి పరిష్కరించాలన్నారు. కలెక్టర్ దివాకర మాట్లాడుతూ అధికారుల సమన్వయంతో అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని, మొదటిసారిగా విద్య పూర్తిచేసిన యువతీ యువకులపై ప్రయోగాత్మకంగా సర్వే నిర్వహించి వారి వివరాలు నమోదు చేస్తామని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌కు వివరించారు. అంతకుముందు కలెక్టర్ దివాకర జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌కు మొక్కను అందజేసి ఆహ్వానించారు. అనంతరం ములుగు మండలం జాకారం వైటీసీలోని ట్రైబల్ యూనివర్సిటీని హుస్సేన్ పరిశీలించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సి.హెచ్.మహేందర్‌జీ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఐటీడీఏ ఏపీవో వసంతరావు, డీఎంహెచ్‌వో అప్పయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తు న్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు

గ్రామస్థుల చైతన్యంతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు

ఐనవోలు, జూన్ 21: గ్రామస్థుల చైతన్యంతోనే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయనడానికి ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలే నిదర్శనమని, ఆదిశగా గ్రామాల్లో పాఠశాలలను బలోపేతం చేసుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ నిధులు రూ.18 లక్షలతో నిర్మించనున్న అదనపు గదుల నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి శంకుస్థాపన చేశా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. మూతపడిన పాఠశాలను గ్రామస్థులు చైతన్యంతో తెరిపించుకోవడమే కాకుండా తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపించకుండా ప్రైవేటు ఉపాధ్యాయులను ఏర్పరుచుకొని మంచి ఫలితాలు సాధించడం సంతోషకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలంటే తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరమన్నారు. ఈ గుర్తింపు పొందిన పాఠశాలను ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు రెండుగా విభజించడంతో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు (ఉపాధ్యాయులు) వస్తారని, అందుకు తనవంతుగా ప్రభుత్వం దృష్టికి ఇక్కడి సమస్యను తీసుకెళ్తానని తెలిపారు.

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. పాఠశాల పనితీరు అద్భుతంగా ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కోసం కృషి చేస్తోందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఆదర్శవంతమైన ఈ పాఠశాలలో మౌలిక వసతులకై తన సీడీఎఫ్ నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు దుస్తులు, నోట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హెచ్ఎం రత్నకుమార్ అధ్యక్షత వహించగా తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ కడుదూరి రాజు, ఎంఈవో వెంకటేశ్వర్‌రావు, అమ్మఆదర్శ కమిటీ చైర్మన్ సకీన, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ పొన్నాల రాజు, నాయకులు సమ్మెట మహేందర్, ఎలిషా, గిరుక రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గుంజేడు శ్రీ ముసలమ్మ గుడి ఆవరణలో భక్తుల కోలాహలం

గుంజేడు శ్రీముసలమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

కొత్తగూడ, జూన్ 21: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని గుంజేడులోని శ్రీముసలమ్మ జాతరకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. వ్యవసాయ పనులు మొదలు పెట్టేముందు రైతులు శ్రీముసలమ్మ దేవతను దర్శించుకొని పంటలు బాగా పండాలని మొక్కుకోవడం, వాగు నీటిని తీసుకువెళ్లి వ్యవసాయ భూముల్లో చల్లుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం. అందులో భాగంగా రైతుల కుటుంబాలు అధిక సంఖ్యలో ముసలమ్మ జాతరకు తరలివచ్చారు. కుటుంబసమేతంగా ముసలమ్మ దేవతను దర్శించుకున్నారు. దీంతోపాటు పాఠశాలలు ప్రారంభం కావడంతో పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల కుటంబాలు, పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల కుటుంబాలు శ్రీముసలమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నూతన వాహనాలు తీసుకున్న భక్తులు గుడి వద్ద వాహన పూజలు చేశారు. అనంతరం ఆహ్లాదకరంగా అడవిలో వంట లు చేసుకుని వనభోజనాలు చేశారు. కుటుంబసభ్యులతో ఉల్లాసంగా గడిపారు.

అధికారుల తప్పులు.. టీచర్లకు తిప్పలు..

- ప్రహసనంలా ఉపాధ్యాయుల పదోన్నతులు
- గణితంలో నిబంధన తారుమారు
- సోషల్ అడిక్వసీలో ఒక పోస్టు గల్లంతు
- విద్యార్థులు లేని చోట పీడీలకు స్థానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 21: వరంగల్ జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ ప్రహసనంలా మారింది. అధికారులు చేసిన తప్పులకు పంతుళ్లకు తిప్పలు తప్పడం లేదు. నిబంధనలు అధిగమించడం.. రోస్టర్‌ల ను తప్పుగా చూపించడం.. విద్యార్థులు తక్కువగా ఉన్న చోట పోస్టులను ఓపెన్ చేయడం లాంటి తదితర పొరపాట్లను అధికారులు చేయడం వల్ల పదోన్నతుల్లో కొంత మంది ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీటితోపా టు రోస్టర్ విధానంలో తలెత్తిన సాంకేతిక కారణంతో గురువారం రాత్రి వరకు ప్రభుత్వ విభాగంలోని పీఈటీ లు, స్థానిక సంస్థల విభాగంలోని ఎల్ఎఫ్ఎల్ హెచ్ ఎంలు, ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్‌ల పదోన్నతుల ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. జిల్లాలోని విద్యాశాఖాధి కారులు తప్పుడు జాబితాలను రూపొందించడంతోనే పదోన్నతుల్లో కొందరు ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు ఆరోపణలు చేస్తుంటే ఉన్నతాధికారుల ఆదే శాల మేరకే జాబితాలను రూపొందించామని డీఈవో వాసంతి పేర్కొన్నారు.

గణితంలో నిబంధన తారుమారు

ప్రభుత్వ విభాగంలోని గణితం స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల్లో నిబంధనలను అధికారులు తారుమారు చేశారని సంబంధిత ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ విభాగంలో మొత్తం 5 క్లియర్ వేకెన్సీలతో జాబితాను రూపొందించారు. ఇందులో 70 శాతం పదోన్నతులతో, 30 శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో భర్తీ చేయాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ మాత్రం ఒక్క పోస్టును మాత్రమే పదోన్నతితో భర్తీ చేశారు. 4 పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కు అధికారులు నోటిఫై చేయడంతో నిబంధనలను తారుమారు చేసినట్లు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నలుగురు ఉపాధ్యాయులు పదోన్నతులు సాధించాల్సి ఉండగా వారికి మొండిచేయి మిగిలింది.

ఎస్సీల పదోన్నతులు

స్థానిక సంస్థల విభాగంలో సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల్లో ఎస్సీల విభాగంలో అడిక్వసీ ప్రకారం అధికారులు పదోన్నతులు నిర్వహించలేదని సంబంధిత ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడిక్వసీ జాబితాలో 9 పోస్టులకు పదోన్నతి కల్పిస్తున్నట్లు జాబితాను రూపొందించిన అధికారులు 8 మందికి మాత్రమే పదోన్నతి కల్పించడంతో మరో ఉపాధ్యాయుడు పదోన్నతి పొందలేకపోయినట్లు వారు ఆరోపిస్తున్నారు. తమకు అడక్వసీ విషయంలో తనకు పదోన్నతి కల్పించాలని కోరుతూ ఓ ఉపాధ్యాయురాలు డీఈవోకు వినతి పత్రం అందజేశారు.

రోస్టర్ పాయింట్లు తారుమారు

వికలాంగుల రోస్టర్ పాయింట్లలోనూ అధికారులు తారుమారు చేసినట్లు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. స్థానిక సంస్థల విభాగంలోని తెలుగు ఎస్ఏ పదోన్నతుల్లో రోస్టర్ పాయింట్ 6లో వీహెచ్ ఉమెన్‌ను కేటాయించాల్సిన చోట వీహెచ్ మెన్ రోస్టర్‌ను కేటాయించడంతో సదరు మహిళా ఉపాధ్యాయురాలుకు అన్యాయం జరిగినట్లు తెలుస్తోంది. ఆ మహిళా ఉపాధ్యాయురాలు డీఈవో కార్యాలయంలో ఈ విషయమై వినతి పత్రం అందజేశారు.

పోస్టులు బ్లాక్

వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ విభాగంలోని స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉన్నతీకరణలోనూ అధికారులు తప్పులో కాలేశారు. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ఎక్కువగా ఉన్న చోట పీడీలు అవసరం ఉండగా అందుకు భిన్నంగా విద్యార్థులు తక్కువ సంఖ్యలో ఉన్న పాఠశాలల్లో అధికారులు పోస్టులను ఉన్నతీకరణ చేసి విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో పోస్టులను బ్లాక్ చేశారు. ఖిలావరంగల్ మండలంలోని పలు పాఠశాలల్లో పీడీలు అవసరం ఉండగా వాటిని బ్లాక్ చేసి వరంగల్ మండల పరిధిలో తక్కువ సంఖ్యలో విద్యార్థులున్న పాఠశాలల్లో పీడీల పోస్టులను ఓపెన్ చేశారు. దీంతో అధికారుల తప్పిదంతో అవసరమున్న పాఠశాలల్లో పీడీలు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే జాబితా

వరంగల్ డీఈవో డి.వాసంతి

పదోన్నతుల ప్రక్రియలో జిల్లాలో రూపొందించిన ప్రతీ జాబితా విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే రూపొందించాం. నిబంధనల మేరకు రోస్టర్ విధానాన్ని అనుసరిస్తూ సీనియారిటీ జాబితాలతో పాటు అప్‌గ్రేడ్ చేశాం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలల్లో పీడీ పోస్టుల విషయంలో జరిగిన పొరపాటును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వాటిని సైతం ఉన్నతాధికారులు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు.

అవసరం లేని చోట అప్‌గ్రేడేషన్

అవసరం లేని చోట అధికారులు ఎల్పీల పోస్టులను అప్‌గ్రేడ్ చేశారని ఉపాధ్యాయుల తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటం, రెండు తరగతులు మాత్రమే ఉన్న చోట్ల రోస్టర్ విధానం పేరుతో అన్యాయంగా అప్‌గ్రేడ్ చేశారని ఉపాధ్యాయులు విమర్శలు చేస్తున్నారు. వరంగల్ మండలంలోని కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో 6, 7 తరగతుల్లో 15 మంది విద్యార్థులు మాత్రమే ఉండగా అక్కడ ఎల్పీ పోస్టు అప్‌గ్రేడ్ అవసరం లేకున్నా అధికారులు అనవసరంగా అప్‌గ్రేడ్ చేసినట్లు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే నిలదీస్తాం..

- అర్హులందరికీ పీఎం కిసాన్ అందేలా చర్యలు
- కొత్తకొండ ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



కొత్తకొండలో స్వామివారికి కోడె, గుమ్మడికాయ మొక్కులు చెల్లిస్తున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

భీమదేవరపల్లి, జూన్ 21: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే నిలదీస్తామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఎడాపెడా హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరిస్తోందన్నారు. శుక్రవారం రాత్రి భీమదేవరపల్లి మండలానికి వచ్చిన బండి సంజయ్‌కుమార్‌కు బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ముందుగా ముల్కనూర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ శ్రేణులు పెద్దఎత్తున బాణాసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు. అనంతరం కొత్తకొండ శ్రీవీరభద్ర స్వామి ఆలయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు ఆలయ ఈవో కిషన్‌రావు ఆధ్వర్యంలో అర్చ కులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామికి కోడె, గుమ్మడికాయ మొక్కులు చెల్లించారు. వీరభద్రస్వామికి ప్రత్యేకంగా అర్చన, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకు న్నారు. అనంతరం ఆలయ ఆవరణలో బండి సంజయ్ విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కేంద్ర ప్రభుత్వానికి సహకరించి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలని, ఆ తర్వాత అందరూ అభివృద్ధిపై సహకరించుకోవాలన్నారు. కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి దేవాలయానికి పర్యాటక శోభ తీసుకువస్తామన్నారు. ఇందుకు అవసరమయ్యే నిధులను సమీకరిస్తామన్నారు. కొత్తకొండ దేవాలయ అభివృద్ధికి కావాల్సిన ప్రణాళికను రూపొందించాలని ఈవోను కోరారు.

కాగా, రాష్ట్రంలో 2019 తర్వాత వ్యవసాయ భూమి ఉన్నప్పటికీ పీఎం కిసాన్ యోజన రావడం లేదని విలేకరులు ప్రశ్నించగా, ఈ విషయాన్ని ప్రధాని మోదీ, వ్యవసాయ శాఖ మంత్రిత్వ శాఖతో మాట్లాడి విధి విధానాలు రూపొందించేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే భీమదేవరపల్లి ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, బీజేపీ నాయకులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, దొంగల కొంరయ్య, బీజేపీ మండలాధ్యక్షుడు పైడిపల్లి పృథ్వీరాజ్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి గుండెల్లి సదానందంయాదవ్, గోదల సంపత్, బండారి కరుణాకర్, అంబీరు కవిత, ఊసకోయిల కిషన్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాజీపేట, జూన్ 21: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాజీపేట ఎస్సై లవన్‌కుమార్ వివరాల ప్రకారం.. హనుమకొండకు చెందిన ఎమ్డీ నజీర్ (47) మార్బుల్ టైల్స్‌లో కూలిపని చేస్తూ జీవిస్తున్నాడు. ఈనెల 17న కాజీపేట నుంచి హనుమకొండకు వెళ్తున్న క్రమంలో ఫాతిమా నగర్ వద్ద ఒక లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ లారీతో నజీర్‌ను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో నజీర్‌కు తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలపాలైన అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం 108లో ఎంజీఎంలో చేర్పించారు. చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందాడు. నజీర్ భార్య అంజుమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉంది.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

వడ్డెపల్లి, జూన్ 21: రాష్ట్రప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ అధ్యయన కేంద్రంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశానికి సంబంధించి నిర్వహించే ప్రిలిమినరీ పరీక్షకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల నుంచి దరఖాస్తు ఆహ్వానిస్తోంది. డిగ్రీ ఉత్తీర్ణులై వార్షిక ఆదాయం రూ.3 లక్షలు మించకుండా ఉన్నవారు అర్హులు. జూలై 10వ తేదీలోపు tsstudycircle.co.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ గౌరవ సంచాలకులు డాక్టర్ కె.జగన్ మోహన్ సూచించారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

లెక్చరర్ల భర్తీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

వడ్డెపల్లి, జూన్ 21: తెలంగాణ మైనారిటీల గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్ పోస్టులను ఔట్ సోర్సింగ్ పద్ధతి ద్వారా భర్తీ చేయనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మేన శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ లెక్చరర్ల పోస్టులు తెలుగు, భౌతికశాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రంతోపాటు పీజీటీ ఆంగ్లంలో అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 22 నుంచి 25 వరకు సాయంత్రం 4 గంటల లోపు జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు. వివరాలకు సెల్ నంబర్ : 80749 94073లో సంప్రదించాలని కోరారు.

జూలై 1 నుంచి ఎస్డీఎల్‌సీఈ సైకాలజీ పరీక్షలు

కేయూ క్యాంపస్, జూన్ 21: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ఎంఎస్సీ సైకాలజీ ఫైనల్ ఇయర్-2023 వార్షిక పరీక్షలు జూలై 1 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.నరేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1, 3, 5, 8 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. వర్సిటీ క్యాంపస్‌లోని ఎడ్యుకేషన్ కళాశాలలో పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. జూలై 9 నుంచి 14 వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 మొదటి సెషన్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్‌లో ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని గ్రూపుల వారిగా కేటయించిన సమయంలో పరీక్షలకు హాజరుకావాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కేయూ దూరవిద్య కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

రుణమాఫీపై తుమ్మలను కలిసిన టెస్కాబ్ చైర్మన్



మంత్రి తుమ్మలకు వివరాలను తెలియజేస్తున్న మార్నేని

హనుమకొండ సిటీ, జూన్ 21: రైతుల రుణ మాఫీ అంశం విషయంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు హైదరాబాద్‌లో శుక్రవారం రాష్ట్ర సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. సహకార బ్యాంకుల్లో రుణం తీసుకున్న రైతుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 7,74,833 ఉన్నట్లు మంత్రికి వివరించారు. రైతులకు లబ్ధిచేకూరేలా నిర్ణయాలు తీసుకోవాలని రవీందర్‌రావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎమ్మెల్యే రవీందర్‌రావు, టెస్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తెయ్య, డీసీసీ బ్యాంకుల చైర్మన్లు పాల్గొన్నారు.

రేపు అవగాహన సదస్సు

వడ్డెపల్లి, జూన్ 21: మానవహక్కులపై జాతీయ స్థాయి. అవగాహన సదస్సు ఆదివారం ఉదయం 11గంటలకు హనుమకొండ ప్రెస్‌క్లబ్ ప్రాంతంలోని ఆదర్శ లా కాలేజీలో నిర్వహించనున్నట్లు నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూవ్‌మెంట్ రాష్ట్రకార్యదర్శి పోలెపాక మధు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్, హనుమకొండ జిల్లాలకు సంబంధించి న సంస్థ ప్రతినిధులందరూ ఈ అవగాహన సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

హనుమకొండ టౌన్, జూన్21: హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా రికవరీ చేసి బాధితులకు శుక్రవారం రాత్రి అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ వై.సతీష్ వెల్లడించారు. సెల్‌ఫోన్స్‌ను రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్స్ గౌస్‌పాషా, వీరేందర్‌ను సీఐ ప్రత్యేకంగా అభినందించారు.



సీకేఎం కళాశాల మైదానంలో అంతర్జాతీయ యోగా వేడుకలకు హాజరైన విద్యార్థులు, నగరవాసులు

యోగాతో రోజును ప్రారంభించాలి

త్రిదండి చిన్నజీయర్ స్వామి



మాట్లాడుతున్న త్రిదండి చిన్నజీయర్ స్వామి

పోచమ్మమైదాన్, జూన్ 21 : ప్రతీ ఒక్కరు యోగాతోనే తమ రోజును ప్రారంభించాలని త్రిదండి చిన్నజీయర్ స్వామి అన్నారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ యోగా వేడుకలకు ఆయన హాజయర్యారు. తొలుత హాజరైన వారితో యోగాసనాలు చేయించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు స్వతహాగా యోగా పై దృష్టి సారించాలన్నారు. నిరంతరం యోగా చేయడం ద్వారా వ్యాధులు దరి చేరవని, దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బచ్చు రాధాకృష్ణ, డాక్టర్ మురళీకృష్ణ, తుమ్మ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎంకు తప్పని విద్యుత్ కష్టాలు



ఎక్స్‌రే విభాగం వద్ద రోగులు

వరంగల్ మెడికల్, జూన్ 21: ఎంజీఎం ఆస్పత్రిలో వైద్య సేవలు పొందేందుకు వచ్చిన రోగులకు విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు తప్పడం లేదు. సాధారణ వార్డులకు విద్యుత్ సరఫరా జరిగితే తప్ప విద్యుత్ ఉండదు. ఎమర్జెన్సీ వార్డుకు జనరేటర్ ద్వారా సరఫరా చేస్తున్నా సకాలంలో సిబ్బంది స్పందించకపోవడంతో అంతరాయం ఏర్పడుతోంది. శుక్రవారం ఎంజీఎం క్యాజువాలిటీ విభాగంలోని ఎమర్జెన్సీ ఎక్స్‌రే విభాగంలో సుమారు గంటపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఎక్స్‌రే సేవలు నిలిచిపోయాయి. అంతేకాకుండా పలు వార్డులకు సైతం కరెంట్ వస్తు పోతూ ఉండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



గణపురం మండలం బస్వరాజుపల్లి గ్రామంలో పత్తి విత్తనాలు వేయగా వర్షం లేని కారణంగా మొలకెత్తకపోవడంతో నీళ్లు పోస్తున్న రైతు కుటుంబం

చూస్తూ ఉండలేక..

కరుణ చూపని వరుణుడు.. వానల కోసం ఎదురుచూస్తున్న రైతులు

వర్షాలు ఊరిస్తున్నాయి. అడపాదడపా జల్లులు తప్ప సరైన వానలు లేకపోవడంతో వానాకాలం సాగు పనులు ముందుకు సాగడం లేదు. సాధారణంగా ఏటా జూన్ మొదటి వారంలోనే వర్షాలు ఆరంభమై సమృద్ధిగా కురిసేవి. కానీ, ఈ ఏడాది జూన్ ముగుస్తున్నా ఇంకా సరైన వర్షాలు పడటంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఇప్పటికే చాలామంది రైతులు దుక్కులు దున్ని విత్తనాలు వేయగా వానలు లేక అవి మొలకెత్తే పరిస్థితి కనిపించడం లేదు. మొలకెత్తినవి కూడా వడబడుతున్నాయి. దీంతో వాటిని కాపాడుకునేందుకు రైతులు ప్రయత్నాలు చేస్తున్నారు. ట్యాంకులు, బిందెలతో నీటిని అందించేందుకు ప్రయత్నిస్తున్నారు. భూపాలపల్లి జిల్లాలోని పలుప్రాంతాల్లో శుక్రవారం పలువురు రైతులు ఇలా మొక్కలకు నీరు పోయడం కనిపించింది.

ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, భూపాలపల్లి

ఘనంగా యోగా దినోత్సవం



తాడ్వాయి మండలం ఇందిరానగర్ జడ్పీహెచ్ఎస్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

భూపాలపల్లిటౌన్, జూన్ 21: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా జడ్జి నారాయణబాబు ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో యోగా తరగతులు నిర్వహించారు. జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రామచంద్రరావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అఖిల, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బల్ల మహేందర్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు. భూపాలపల్లి పట్టణంలోని జయశంకర్ పార్కులో సుమారు 90 మందికి హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా యోగా శిక్షణ ఇచ్చారు. జిల్లా కోఆర్డినేటర్ రవీందర్, లక్ష్మణ్, మాధవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా కేంద్రంలో జరిగిన పలు కార్యక్రమాల్లో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజ్ దేవుడే, డిగ్రీ కళాశాల ప్రిన్సిల్ శ్యాంప్రసాద్, కేజీబీవీ కళాశాల ఎస్‌వో జయవసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- చిట్యాల: మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈవో రఘుపతి, ఉపాధ్యాయులు నీలిమారెడ్డి, విజయలక్ష్మి, శంకర్, నారాయణ, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.
- గణపురం: చెల్పూరులో ఉపాధి కూలీలతో కలిసి డీఆర్‌డీవో పీడీ నరేష్ యోగా నిర్వహించారు. ఎంపీడీవో భాస్కర్, ఏపీవో రాజు, టీఏ శ్రావణ్, పంచాయతీ కార్యదర్శి హరిశ్చంద్రారెడ్డి, ఎఫ్ఏ శంకర్ పాల్గొన్నారు.
- వెంకటాపురం(నూగూరు): మండలకేంద్రంలోని కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ క్రీడా మైదానంలో యోగా దినోత్సవం జరిగింది. యోగా మాస్టర్ స్విమిరెడ్డి ప్రాణాయామం, తదితర ఆసనాలు చేయించగా ప్రము ఖులు, గ్రామస్థులు పాల్గొన్నారు.
- మల్హర్: మండల కేంద్రమైన తాడిచర్లలో జరిగిన కార్యక్రమంలో యోగా మాస్టర్ శివకృష్ణ, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మోహన్‌రావు, మండల అధ్యక్షుడు ప్రభాకర్, అశోక్, రాజు, నరేష్, శేరాలు, నవీన్, కార్తీక్‌రావు, శ్రీకాంత్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.
- మేడారం: తాడ్వాయి మండలం మేడారం, ఊరట్టం గ్రామాల్లో యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకు న్నారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు యోగాసనాలు వేశారు. ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- కాకతీయఖని: సింగరేణి ఆధ్వర్యంలో జీఎం కార్యాలయంలో నిర్వహించిన యోగా డేకు ఏరియా జనరల్ మేనేజర్ హబీబ్‌హుస్సేన్ హాజరయ్యారు. అధికా రులు తుకారాం, జ్యోతి, రవికుమార్, సురేఖ పాల్గొన్నారు.
- వెంకటాపూర్(రామప్ప): మండల కేంద్రంలోని వేదవ్యాస ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాస నాలు వేశారు. హెచ్ఎం పోశాల వీరమల్లు, డైరెక్టర్లు పసునూటి రాజయ్య, సూర్యప్రకాశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- కాటారం: మండలంలో జరిగిన యోగా దినోత్సవంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య పాల్గొన్నారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో సివిల్, సీఆర్‌పీఎఫ్ బలగాలతో యోగా మాస్టర్ ఆసనాలు వేయించారు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- మంగపేట : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. యోగా గురువులు యెర్రంకాని రాంబాబు(పిత్రీజీ), వకులాభరణం రఘుపతి యోగాసనాలు వేయించారు. బీజేవైఎం జిల్లా కార్యదర్శి ప్రశాంత్, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు లోడే శ్రీనివాస్‌గౌడ్, బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసరావులు, బీజేపీ మండల అధ్యక్షుడు పల్నాటి సతీష్, మండల ప్రధాన కార్యదర్శి చల్లా రాంకీ, మండల ఉపాధ్యక్షుడు చీకట్ల యాకస్వామిగౌడ్, ధ్యాన భక్త మండలి సభ్యులు అలవాల ప్రవీణ్, శివ, చిరంజీవి, మద్దిని కృష్ణమూర్తి, సుధాకర్, రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.
- వాజేడు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలు ఉపాధ్యాయులు, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.
- తాడ్వాయి: మండలవ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, ఆశ్రమ పాఠశాలల్లో యోగా దినోత్సవం జరిగింది కాటాపూర్ జడ్పీహెచ్ఎస్‌తోపాటు పలు పాఠశాలల్లో శిక్షకులు విద్యార్థులు, ఉపాధ్యాయులకు యోగా ఆవశ్యకత, ఆరోగ్యసూత్రాలు, యోగా వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు చంద్రారెడ్డి, రజిత, శంకర్, వసంతరావు, వనిత, మంకిడి స్వామి తదితరులు పాల్గొన్నారు.
- ఏటూరునాగారం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో యోగా వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా డాక్టర్ బండ్ల వరప్రసాదరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వాకర్స్, స్పోర్ట్స్ క్లబ్ క్రీడాకారులకు యోగాపై అవగాహన కల్పించారు.
- గోవిందరావుపేట: మండల కేంద్రంలోని ఆర్యవైశ్య ఫంక్షన్‌హాల్ ఆవరణలో బీజేపీ మండల అధ్యక్షుడు మద్దినేని తేజరాజు అధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రారపు సురేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాయకులు బొమ్మెరబోయిన భిక్షం, అంకిరెడ్డి రమాదేవి, పాక సమ్మయ్య, అంతిరెడ్డి సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్, అజ్మీరా లలిత, బెల్లి లింగయ్య, రామచంద్రు, రమేష్, మల్లేష్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- ములుగు కలెక్టరేట్ : ప్రపంచ యోగా దినోత్సవాన్ని ములుగులో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్యతోపాటు వైద్యసిబ్బంది పలు యోగాసనాలు వేశారు. అనంతరం యోగా శిక్షకులు డాక్టర్ సారంగపాణి, మహబూబ్‌పాషా, పోషన్నను శాలువాలతో సత్కరించారు. లయన్స్‌క్లబ్ సభ్యులు సాంబశివ, రమేష్, వైద్యులు పవన్, మధు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ములుగులోని జిల్లా కోర్టు ఆవరణలో జరిగిన యోగా దినోత్సవంలో జిల్లా జడ్జి ఎస్‌వీపీ.సూర్యచంద్రకళ, జడ్జిలు, న్యాయవాదులు పలు యోగాసనాలు వేశారు.

ఐటీడీఏ పీవో తనిఖీ

ములుగు కలెక్టరేట్, జూన్ 21: ములుగు, వెంకటాపూర్(రామప్ప) మండలాల్లోని ఎస్టీ బాలురు, బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలను శుక్రవారం ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా సందర్శించి తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా ఆమె ఆయా పాఠశాలల్లో తరగతిగదులు, వంట గదులను పరిశీలించారు. విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు, కిచెన్‌షెడ్లు, మరుగుదొడ్లు, తదితరాల మరమ్మతు పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాఠశాల ఆటస్థలాన్ని చదును చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. ఆమెవెంట ములుగు ప్రత్యేక అధికారి దేవిశ్రీ, సహాయ గిరిజనాభివృద్ధి అధికారి దేశీరాం, తదితరులు ఉన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం

వాజేడు, జూన్ 21: వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటారని ఏటూరునాగారం ఐటీడీఏ డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టరు కోరం క్రాంతి కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని దూలాపురంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించి జ్వరాలతో బాధపడే వారిని గుర్తించి వారికి వైద్యప రీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అదే విధంగా ఫ్రైడే డ్రై డే సందర్భంగా నిల్వ ఉన్న నీటిని పారబోసి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

బీఎస్ఎన్ఎల్ సేవలకు అంతరాయం

తాడ్వాయి, జూన్ 21: మండలవ్యాప్తంగా గత వారంరోజుల నుంచి బీఎస్ఎన్ఎల్ సేవలకు అంతరాయం ఏర్పడుతుండడంతో వినియోగదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో ఎక్కువసంఖ్యలో బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఉండడంతో వ్యాపారులు, ఉద్యోగులు సెల్‌ఫోన్లలో అనేక లావాదేవీలు నిర్వహిస్తుంటారు. వారంరోజులుగా సేవలకు అంతరాయం కలుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఎలాంటి అంతరాయం లేకుండా సేవలను వినియోగంలోకి తీసుకురావాలని, లేనట్లయితే ఇతర కంపెనీల నెట్‌వర్క్‌లు మారడం తథ్యమని వినియోగదారులు హెచ్చరిస్తున్నారు.

మంగపేటలో సంత ప్రారంభం

మంగపేట, జూన్ 21: మండల కేంద్రంలో వారాంత సంత శుక్రవారం ప్రారంభమైంది. పంచాయతీ కార్యదర్శి సురేష్ ప్రారంభించారు. ప్రతి శుక్రవారం ఈ సంత జరుగుతుందని, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.

రేగులగూడెంలో ఫీవర్ సర్వే

మంగపేట, జూన్ 21: మండలంలోని కొత్తూరు మొట్లగూడెం గ్రామపంచాయతీ పరిధి రేగులగూడెంలో మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై ఈ సంద ర్భంగా అవగాహన కల్పించారు. వైద్యాధికారి వైశాలి, సూపర్‌వైజర్ గంగమ్మ, ఏఎన్ఎంలు స్వరూప, విజయలక్ష్మి, హెల్త్‌అసిస్టెంట్ రవితేజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కాపురంలో ఆర్డీవో పర్యటన

మల్హర్, జూన్ 21: మండలంలోని కాపురం గ్రామంలో ఆర్డీవో మంగిలాల్ పర్యటించారు. గ్రామ కంఠం భూమి 6.31 గుంటలకు సంబంధించి నిర్వాసితులకు పరిహారం చెల్లించాల్సి ఉండగా పరిశీలించారు. పరిహారం చెల్లింపులో జాప్యం చేయొద్దని ఈ సందర్భంగా నిర్వాసితులు ఆర్డీవోను కోరారు. ఆయన వెంట తహసీల్దార్ రవికుమార్, జెన్‌కో అధికారులు ఉన్నారు.

నేడు దేవుని గుట్టపై 'వరదపాశం'

ములుగు (రూరల్): ములుగు మండలం కొత్తూరు గ్రామ శివారులోని దేవుని గుట్టపై కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వరద పాశం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ చైర్మన్ వీరంనేని కిషన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాదంతా అనుకూలంగా వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని తొలకరిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పారిశుధ్య కార్మికులకు పరికరాల అందజేత

టేకుమట్ల, జూన్ 21: టేకుమట్ల గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు భద్రత పరికరాలను ఎంపీవో సురేష్ ఎంపీటీసీ ఆది సునీత అందజేశారు. ఆప్రాన్, గ్లౌవ్స్, పారలు, పని అనంతరం శుభ్రం చేసుకునేందుకు సబ్బులు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో దుక్కిటెద్దు మృత్యువాత

టేకుమట్ల, జూన్ 21: మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామంలో పాముకాటుతో దుక్కిటెదు శుక్రవారం మృతి చెందింది. తన ఇంటి వద్ద పాకలో కట్టేసిన ఎడ్లలో ఒకదాన్ని పాము కాటేయగా చికిత్స అందించే ప్రయత్నం చేసేలోపే అది మృతి చెందిందని బాధిత రైతు సుధాకర్ తెలిపాడు. మృతి చెందిన ఎద్దు విలువ సూమారు రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

విద్యుదాఘాతంతో పాడి గేదె..

కాటారం : మండలంలోని మేడిపల్లి గ్రామంలో గడవేన కొమురయ్య అనే రైతుకు చెందిన పాడిగేదె శుక్రవారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. గ్రామస్థులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గాలి దుమారానికి పొలాల్లో ఉన్న విద్యుత్ తీగ తెగిపడి మేతకు వెళ్లిన గేదెపై పడటంతో అది మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం తనకు ఆదుకోవాలని రైతు కొమురయ్య కోరుతున్నాడు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

చిట్యాల, జూన్ 21: మండలంలోని జూకల్ గ్రామంలో శుక్రవారం సివిల్ సప్లయ్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పలు చోట్ల శుక్రవారం దాడులు చేసి పీడీఎస్ (రేషన్) బియ్యాన్ని పట్టుకున్నారు. గ్రామానికి చెందిన కొమ్ము రవి, మొలుగూరి రాజు ఇంట్లో పెద్ద మొత్తంలో రేషన్ బియ్యం నిల్వ ఉన్నాయనే సమాచారం మేరకు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. రవి ఇంట్లో 1350, రాజు ఇంట్లో 50.70 క్వింటాళ్ల బియ్యం పట్టుబడగా వాటిని స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ప్రభాకర్, ఎస్సై జంగయ్య, డీసీఎస్‌వో నర్సింగరావు, డీఎం రాఘవేందర్, చిట్యాల ఆర్ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పరిధిలోని టీచర్లకు పదోన్నతులు చేపట్టాలి : టీడబ్ల్యూటీయూ

మేడారం, జూన్ 21 : ఐటీడీఏ పరిధి ఉపాధ్యాయులకు పదోన్నతి కలిగిన బదిలీల షెడ్యూలు ప్రభుత్వం విడుదల చేయాలని ట్రైబల్ వెల్ఫేర్ టీచర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొక్కెర రమేష్ ప్రకటనలో కోరారు. గిరిజన సంక్షేమ శాఖ విద్యా విభాగంలో ఆశ్రమ పాఠశాలలో అనేక సంవత్సరాలుగా ఒకే చోట విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు ప్రమోషన్, ట్రాన్స్‌ఫర్లు లేక మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. అదేవిధంగా తెలుగు 2, హిందీ 2, పీఈటీ, వ్యాయామ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఐటీడీఏ పరిధిలో నడుస్తున్న కన్వర్టెడ్ పాఠశాలలో పోస్టులు మంజూరు చేయాలని, సూపర్ న్యూమరి ఉపాధ్యాయులకు బదిలీల్లో అవకాశం కల్పించాలని పేర్కొన్నారు.

ఎస్టీ కమిషన్ సభ్యుడికి వినతి

ములుగు కలెక్టరేట్, జూన్ 21: షెడ్యూల్డ్ ఏరియాలో రాజ్యాంగబద్ధమైన గిరిజన చట్టాల అమలులో తీవ్ర జాప్యం జరుగుతోందని, ఇందుకోసం తగిన చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్‌ను ఏఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కొర్నా నర్సింహమూర్తి కోరారు. శుక్రవారం ములుగుకు వచ్చిన హుస్సేన్‌నాయక్‌ను ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో 1/70, పెసా, అటవీ హక్కుల గుర్తింపు చట్టాలు అమలుకు నోచుకోవడంలేదని తెలిపారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోర్టు పని చేయకపోవడంతో వేలాది ఎకరాల భూములు అన్యాక్రాంతమవుతున్నాయని అన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో రొటేషన్ విధానాన్ని రద్దు చేయాలని, సింగిల్‌లైన్ అడ్మినిస్ట్రేషన్ అధికారం కలిగిన ఐటీడీఏలను రాజకీయ జోక్యం లేకుండా బలోపేతం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

చిట్యాల, జూన్ 21: ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు గాయపడిన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... భూపాలపల్లికి చెందిన జొన్నల లింగయ్య వ్యక్తిగత పని నిమిత్తం జమ్మికుంట వెళ్లి తిరిగి వస్తుండగా చిట్యాల శివారులోని గ్యాస్ గోదాం క్రాస్ వద్ద బైక్ అదుపుతప్పింది. దీంతో అతడు గాయపడ్డాడు. అదే సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ అటువైపుగా వచ్చి బ్లూకోర్టు కానిస్టేబుల్స్ నవీన్, లింగన్న అతడిని చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించారు.

సింగరేణి దవాఖానాలో
అందని ద్రాక్షగా వైద్యం

మావోయిస్టు పార్టీ కోల్‌బెల్ట్ ఏరియా కార్యదర్శి ప్రభాత్

కాకతీయఖని, జూన్ 21: సింగరేణి ఏరియా దవాఖానలో కార్మికులకు వైద్యం అందని ద్రాక్షలా మారిందని మావోయిస్టు పార్టీ కోల్‌బెల్ట్ ఏరియా కార్యదర్శి ప్రభాత్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లాభాపేక్షే ధ్యేయంగా సింగరేణి యాజమాన్యం కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మికుల ఆరోగ్యాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రకటనలకే పరిమితమై మోసపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కొన్ని ఏరియాల్లో ఎక్స్‌రే యంత్రాలు, స్కానింగ్ మిషన్లు పనిచేయడం లేదని, రక్త పరీక్షలకు సరైన పరికరాలు అందుబాటులో లేవని తెలిపారు. సరైన వైద్యులు, స్పెషలిస్టులు లేకపోవడంతో కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ప్రాణాపాయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కార్మికులకు లోకాస్ట్ మందులు అందించి వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని దుయ్యబట్టారు. సింగరేణి ఏరియా ఆస్పత్రుల్లో వైద్యులను, యంత్రాలను అందుబాటులోకి తీసుకురావాలని, సరిపడా మందులు అందించాలని డిమాండ్ చేశారు.

పోలీస్ పోస్టింగ్.. పరేషాన్!

(3వ పేజీ తరువాయి)

నేతలు వేర్వే రుగా సిఫార్సులు చేస్తున్నారని సమాచారం. నగర పరిధిలో ఉండే నాలుగైదు పోలీస్‌స్టేషన్లలో పోస్టింగ్ కోసం భారీగా క్యూ కడుతున్నారని తెలుస్తోంది.

మా కుర్చీ మాకే కావాలి..

పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఫిబ్రవరి నెలలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీగా పోలీసులు బదిలీలు జరిగాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఏర్పడటంతో ఎమ్మెల్యేలు, కీలక నేతలు సూచించిన వారికి పోస్టింగులు దక్కాయి. ఆ సమయంలో కొందరు నేతలు భారీగా కక్కుర్తి పడి పోస్టింగులు ఇప్పించినట్టు ప్రచారం జరిగింది. కొన్ని స్టేషన్ల ఎస్‌హెచ్‌వోల పోస్టింగులకు రూ.20లక్షల నుంచి రూ.25లక్షల వరకు చేతులు మారినట్లు అప్పట్లో గుసగుసలు వినిపించాయి. అయితే ఫిబ్రవరిలో విధుల్లో చేరిన కొంతమంది అధికారులకు మార్చిలో జరిగిన బదిలీల్లో స్థానచలనం తప్పలేదు. అప్పటికే సిఫార్సు లేఖల కోసం భారీగా సమర్పించుకున్న వారు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. ప్రస్తుతం కోడ్ ముగియటంతో పోస్టింగులు ఇస్తుండటంతో మళ్లీ తమ పాత స్థానాలు తమకే ఇవ్వాలని పట్టుబడుతున్నట్టు సమాచారం. అయితే ఆ పోస్టు ఆ సిఫార్సు లేఖ వరకే అని.. మళ్లీ పోస్టు కావాలంటే ఆలోచిస్తామంటూ వరంగల్ నగర సమీపంలోని ఓ నేత ఖాకీలను ఇంటి చుట్టూ తిప్పుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా వేరే అధికారులకు పోస్టింగులు ఇచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో దళారులు రంగంలోకి దిగి బేరసారాలు మొదలు పెట్టినట్టుగా కూడా ప్రచారం జరుగుతోంది. దీంతో తమ పాత పోస్టింగ్ వస్తుందా..లేదా అనే టెన్షన్‌లో కొందరు పోలీసులు ఉండగా, ఎన్నికల బదిలీల్లో వచ్చిన అధికారులు కూడా అదే స్టేషన్‌లో ఉండేందుకు చేయా ల్సిన ప్రయత్నాలు చేస్తున్నారట. తనకున్న పరిచయాలతో ఆయా ఏరి యాల్లోని కీలక నేతలపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో ఒకే స్టేషన్‌పై ఎన్నికల్లో బదిలీ అయినా అధికారితో పాటు ఎన్నిల్లో బదిలీపై వచ్చిన అధికారి, కొత్తగా సిఫార్సు కోసం ప్రయత్నం చేస్తున్న అధికారితో కలిసి ట్రైయంగిల్ ఫైట్‌లో కుర్చీ ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ ఖాకీల్లో నెలకొంది.

సిఫారసు లేకుంటే లూప్‌లైన్‌లోకే...

పోలీసు శాఖలో నిజాయితీగా పని చేసే కొంతమంది అధికారులకు లూప్ లైన్ డ్యూటీస్ తప్పటం లేదు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్పీ స్థాయి అధికారి బదిలీ వరకు పైరవీలు నడుస్తున్నాయనే ఆరోపణలున్నాయి. అన్ని శాఖల కంటే పోలీస్ శాఖలోనే అధికంగా బదిలీలపై రాజకీయ ఒత్తిళ్లు ఉంటాయనే అభిప్రాయాలు ఉన్నాయి. దీంతో నిజాయితీగా విధులు నిర్వహించే కొంతమంది అధికారులు, పైరవీలు చేయటం ఇష్టం లేని అధికారులకు లూప్ లైన్ డ్యూటీలు తప్పవనే చర్చ జరుగుతోంది. అనేక మంది పోలీసు అధికారులు నిజాయితీగా పని చేసినా, రాజకీయ పలుకుబడి లేకపోవటంతో లూప్‌లైన్‌లో ఏళ్ల తరబడి కొనసాగుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం సిఫార్సు లేఖలకు కాకుండా బాధ్యతయుతంగా పని చేస్తున్న వారిని గుర్తించి పోస్టింగులు ఇవ్వాలనే డిమాండ్ కొందరు పోలీసుల నుంచి వినిపిస్తోంది.

పిడుగుపాటుకు
తెగిన తీగలు

భూపాలపల్లిటౌన్, జూన్ 21: భూపాలపల్లి పట్టణంలోని జంగేడు ఫీడర్ పరిధిలో పిడుగుపాటుకు శుక్రవారం సాయంత్రం 11కేవీ విద్యుత్‌లైన్ తెగిపోయింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భారీగా కురిసిన వర్షంతో పాటు పిడుగులు పడటంతో జంగేడు పరిధిలోని విద్యుత్ తీగ తెగిపోయింది. దీంతో విద్యుత్ నిలిచిపోయింది. ఈ విషయాన్ని వెంటనే తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది సదరు లైన్‌ను సరిచేసేందుకు పూనుకున్నారు.

తహసీల్దార్ హామీతో
దీక్ష విరమణ

వెంకటాపురం(నూగూరు), జూన్ 21: కొమురంభీ కాలనీ ఆదివాసీల భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ 12రోజులుగా గోండ్వాన సంక్షేమపరిషత్ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలను శుక్రవారం తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్ విరమింప జేశారు. దీక్షా శిబిరం వద్దకు తహసీల్దార్ చేరుకుని ఆదివాసీల భూ సమస్యను ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూనెం సాయి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ముంపుపై ముందుజాగ్రత్త!

(3వ పేజీ తరువాయి)

పడింది. ఏటూరునాగారం నుంచి మంగపేట దాకా గోదావరి ఒడ్డు కోతకు గురికాగా రూ.137 కోట్లతో చేపట్టిన కరకట్ట పనులూ ముందుకు సాగడంలేదు. రాష్ట్ర మంత్రి సీతక్క ఆదేశాల మేరకు తూములకు మరమ్మతు చేయడంతోపాటు కరకట్టపై పలుచోట్ల ఇసుక బస్తాలను వేస్తున్నారు.

మునిగేవి 48.. సంబంధాలు తెగేవి 50..

జిల్లావ్యాప్తంగా 98గ్రామాల వరద ప్రభావితమైనవిగా గుర్తించారు. వెంకటాపురం(నూగూరు) మండలంలో 10, గోవిందరావుపేటలో 11, కన్నాయిగూడెంలో 4, ఏటూరునాగారంలో 8, తాడ్వాయిలో 9, వాజేడులో 1, మంగపేట మండలంలో 5గ్రామాలు వరద ముంపునకు గురవుతుండగా మరో 50గ్రామాలకు రోజుల తరబడి సంబంధాలు తెగిపోయే ప్రమాదమున్నట్లు గుర్తించారు. వీటిలో వెంకటాపురం(నూగూరు)లో 2, కన్నాయిగూడెంలో 1, ఏటూరునాగారంలో 11, వాజేడులో 10, గోవిందరావుపేటలో 6, తాడ్వాయిలో 5, ములుగులో 1, మంగపేటలో 5 గ్రామాలున్నాయి. గోదావరి నది, జంప నవాగు పరివాహకంలోని పొదుమూరు, గుడ్డేలుగులపల్లి, కత్తిగూడెం, వాడగూడెం, ఆకినపల్లి మల్లారం, రమణక్కపేట, రాజుపేట, బ్రాహ్మణపల్లి, రామన్నగూడెం, నందమూరి నగర్, ఏటూరునాగారం ఎస్సీ కాలనీ, వాడగూడెం, కొండాయి, మల్యాల, గుమ్మడిదొడ్డి ఎస్సీ కాలనీ, మురుమూరు కాలనీ, వాజేడు నాగారం, బీసీ కాలనీ, పూసూరు, ఇప్పగూడెం, కంతనపల్లి వెంకట్రావ్‌పల్లి, కొత్తూరు సర్వాయి, గంగుగూడెం, వెంగల్‌రావుపేట, బోదాపురం, పుస్సవానిగూడెం ముంపుకు గురయ్యే జాబితాలో ఉన్నాయి.

గ్రామానికో అధికారి

వరద ముంపుకు గురయ్యే ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం గ్రామానికో ప్రత్యేక అధికారిని నియమించడం జరిగింది. ఆయా శాఖల మండలస్థాయి అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ఏటూరునాగారం ఐటీ డీఏలో కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేశారు. ములుగు కలెక్టరేట్‌తోపాటు ఇక్కడి నుంచి జిల్లాస్థాయి అధికారులు నిరంతరం సమీక్షించనున్నారు. గతేడాది 49 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి 5,861 మందికి ఆశ్రయం కల్పించిన అధికారులు ఈసారి కూడా ఆయా పునరావాస కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. 61 గ్రామపంచాయతీల పరిధిలోని 93 ఆవాసాల ప్రజలు ముంపు ప్రమాదాన్ని ఎదుర్కొంటుండగా సమీపంలోని పాఠశాలలు, పంచాయతీ భవనాల్లో విడిది, భోజనం సదుపాయం కల్పించేందుకు సిద్ధమయ్యారు. అవసరమైన నిత్యావసరాలు, మందులను ముందే అందుబాటులో ఉంచుకుంటున్నారు. పారిశుధ్య చర్యల కోసం బ్లీచింగ్ పౌడర్, దోమల మందు పిచికారీ ద్రావకాన్ని నిల్వ చేస్తున్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

కాటారం, జూన్ 21: కాటారం సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల పరిధిలో గుడుంబా స్థావరాలపై పోలీస్, ఎక్సైజ్, డీటీఎఫ్ అధికారులు శుక్రవారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ లింగాచారి నేతృత్వంలో కాటారం, మల్హర్, మహదేవపూర్, మహాముత్తారం, పలిమెల మండలాల్లోని పలు గ్రామాల పరిధిలో గుడుంబా స్థావరాలపై దాడులు చేశారు. 3,300 లీటర్లకు పైగా చక్కెర పానకాన్ని ధ్వంసం చేశారు. 10కిలోల బెల్లం, 5కిలోల పటిక, 5.16 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకు న్నారు. 14 కేసులు నమోదు చేసి 13 మందిని అరెస్ట్ చేసి నట్లు ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య తెలిపారు. దాడుల్లో కాటా రం, మహదేవపూర్ సీఐలు నాగార్జునరావు, రాజేశ్వ ర్‌రా వు, డీటీఎఫ్ సీఐ రాజనమ్మయ్య, సబ్ డివిజన్ ఎస్సైలు నరేష్, పవన్, తమాషారెడ్డి, మహేందర్, ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

- చిట్యాల: మండలంలోని పాశిగడ్డతండాలో 25 లీటర్ల గుడుంబా, 150 లీటర్ల బెల్లం పానకాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు చిట్యాల ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు.ఆ గ్రామానికి చెందిన జరుపుల రమేష్, లావుడ్య సునీత, లావుడ్య రాములు, సరోజనను అదుపులోకి తీసుకున్నట్లు పేరొన్నారు.
- టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామంలో పోలీసులు 30లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకు న్నారు. సోత్కు లచ్చమ్మ ఇంట్లో 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. గర్మిళ్లపల్లిలో వాహనాల తనిఖీలు చేస్తుండగా చిట్యాల మండలం గిద్దెముత్తారం తండాకు చెందిన బానోత్ సారయ్య బైక్‌పై 20 లీటర్ల గుడుంబాను తరలిస్తూ పట్టు బడినట్లు తెలిపారు. గుడుంబాను స్వాధీనం చేసుకొని ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.
- గణపురం : మండలంలోని బస్వరాజుపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో పోలీసులు దాడులు నిర్వహించారు. సుమారు 20లీటర్ల గుడుంబాను సీజ్ చేసి 600లీటర్ల పానకాన్ని ధ్వంసం చేశారు. గుడుంబా తయారు చేస్తున్న ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ సుధీర్‌కుమార్, ఎస్సైలు సాంబమూర్తి, లింగాగౌడ్, పోలీసు సిబ్బంది సతీష్, సందీప్, నేతాజీ పాల్గొన్నారు.
- మొగుళ్లపల్లి: మండలంలోని ములకలపల్లి గ్రామ శివారులో గుడుంబా తయారీ కేంద్రాలపై చిట్యాల సీఐ మల్లేష్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. 20లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకోవడంతోపాటు 300లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసం చేశారు. గుడుంబా తయారీకి పాల్పడుతున్న నిందితులు పల్లెవేణి కేతమ్మ, వల్లకొండ ఈశ్వరమ్మ, గంట సంధ్యపై కేసు నమోదు చేశారు. ఈదాడుల్లో ఏఎస్సై ప్రకాశ్, సిబ్బంది పాల్గొన్నారు.

'నీట్' లీకేజీ దోషులను శిక్షించాలి

వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నిరసన

ములుగు కలెక్టరేట్, జూన్ 21: నీట్ పరీక్ష లీకేజీ దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు టి.ఎల్.రవి, రత్నం ప్రవీణ్, కుమ్మరి సాగర్ మాట్లాడుతూ దేశవ్యా ప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించాల్సిన నీట్ పరీక్ష లీకేజీపై తక్షణమే ప్రధాని నరేంద్రమోదీ స్పందించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాల న్నారు. నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహిం చాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో రాకేష్, సాయి, కిషోర్, సద్దాం, దేవేందర్, విజయ్, శివ, రాహుల్ పాల్గొన్నారు.

సీబీఐ విచారణ చేపట్టాలి : కాంగ్రెస్

ఏటూరునాగారం: నీట్ పరీక్ష లీకేజీపై సీబీఐ విచారణ చేపట్టి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట మట రఘు డిమాండ్ చేశారు. మండల కేంద్రం లోని బస్టాండ్ సమీపంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని తెలుస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ. అయ్యుబ్ ఖాన్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్డీ. ఖలీల్ ఖాన్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నూరు బాలరాజు, టౌన్ అధ్యక్షుడు ఎమ్డీ. సులేమాన్, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నేతలు